నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, ఆదివారం 24 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

యాదగిరి గుట్టపై నల్లగొండ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థుల ఖరారు

నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డి.. భువనగిరికి క్యామ మల్లేశ్

సామాజిక సమీకరణ కొనసాగింపు

ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక

తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం : కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్

నల్లగొండ, భువనగిరి బీఆర్ఎస్ లోక్‌సభ స్థానాల అభ్యర్థులపై కొనసాగుతున్న ఉత్కంఠతకు తెరపడింది. పార్టీ శ్రేణుల మనోగతానికి అనుగుణంగా సామాజిక సమీకరణలు, ఇతర బలాబలాల భేరీజు అనంతరం శనివారం సాయంత్రం పార్టీ అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించారు. రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతలతో భేటీ అనంతరం అందరి ఏకాభిప్రాయంతో నల్లగొండ స్థానానికి కంచర్ల కృష్ణారెడ్డిని, భువనగిరి స్థానానికి క్యామ మల్లేశ్‌కుర్మను అభ్యర్థులుగా ఖరారు చేశారు. 2014 నుంచి నేటి వరకు వరుసగా మూడో సారి కూడా సామాజిక సమీకరణలకు పెద్దపీట వేస్తూ అధినేత కేసీఆర్ బలహీనవర్గాల పట్ల మరోసారి తన నిబద్ధతను ప్రదర్శించారు. అభ్యర్థుల ప్రకటనతో ఇక ఎన్నికల కార్యక్షేత్రంలో దూకేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి/యాదాద్రి భువనగిరి, మార్చి 23 (నమస్తే తెలంగాణ)

గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింగేందుకు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నది. అందులో కీలకమైన పార్టీ అభ్యర్థుల ఎంపికను ఏకాభిప్రాయంతో పూర్తి చేసింది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన పార్టీ సీనియర్ నేత కంచర్ల కృష్ణారెడ్డిని ఎంపిక చేసింది. భువనగిరి లోక్‌సభ స్థానానికి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడేనికి చెందిన సీనియర్ నేత క్యామ మల్లేశ్‌ను ఖరారు చేసింది. 2014, 2019 ఎన్నికల్లో మాదిరిగానే నల్లగొండను ఓసీ సామాజిక వర్గానికి, భువనగిరిని బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తున్నట్లుగానే ఈ సారి కూడా అదే సామాజిక సమతుల్యతను పాటించింది. భువనగిరి లోక్‌సభ స్థానంలో బలమైన ఓటుబ్యాంకు కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌కుర్మను ఎంపిక చేయడంపట్ల హర్షం వ్యక్తమవుతున్నది. గత కొద్ది రోజులుగా అభ్యర్థుల ఎంపికపై అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల సూచనల మేరకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆయా నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నేతలతో పలుమార్లు సమాలోచనలు చేశారు. అందరి అభిప్రాయాలతో సరైన అభ్యర్థులపై పలుమార్లు సుదీర్ఘంగా చర్చించారు. ఆయా నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణలు, అభ్యర్థుల బలాబలాలు ఇలా అన్ని కోణాలను పరిగణలోకి తీసుకున్నారు. ఈ విషయాలన్నింటినీ ఎప్పటికప్పుడు అధినేత కేసీఆర్, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ అభ్యర్థుల ఎంపిక, వారి వ్యూహాలను సైతం పరిగణలోకి తీసుకుంటూ పార్టీ అభ్యర్థులపై కసరత్తు పూర్తి చేశారు. ఇలా అన్ని యాంగిల్స్‌లో పరిశీలన అనంతరమే రెండు స్థానాల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థులను ఖరారు చేసింది. వాస్తవంగా భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత బూడిద భిక్షమయ్యగౌడ్ పేరును కూడా చివరి వరకు సీరియస్‌గా పరిశీలించారు. అయితే సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన కత్తి పద్మారావ్‌గౌడ్‌కు అవకాశం కల్పించడంతో భువనగిరిలో గొల్లకుర్మల సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి నల్లగొండతో పాటు జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలతోనూ కలిసి ఉండడంతో అక్కడి పార్టీ ముఖ్యులతోనూ చర్చించారు. ఫైనల్‌గా రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లోని బీసీ వర్గాల మనోభావాలను పరిగణలోకి తీసుకుంటూ క్యామ మల్లేశ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిసింది. శనివారం ప్రకటించిన అభ్యర్థుల్లో సికింద్రాబాద్‌కు కత్తి పద్మారావుగౌడ్, భువనగిరికి క్యామ మల్లేశ్‌కుర్మ, నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డిని ప్రకటించడంతో సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేశారన్న హర్షం వ్యక్తమవుతున్నది.

పార్టీ కార్యక్రమాల్లో కృష్ణారెడ్డి నిబద్ధత

నల్లగొండ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డిని ప్రకటించారు. కంచర్ల సోదరులిద్దరూ ఆది నుంచి తాము నమ్ముకున్న నాయకత్వం పట్ల అంచల విశ్వాసంతో పనిచేస్తారని చర్చ. తమ రాజకీయ ప్రస్థానాన్ని టీడీపీలో ప్రారంభించారు. స్వగ్రామం ఉరుమడ్ల గ్రామ రాజకీయాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. 2017 నవంబర్6న బీఆర్ఎస్‌లో చేరే వరకు తాము నమ్ముకున్న టీడీపీలోనే కొనసాగారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే ఎన్‌టీఆర్ స్థాపించిన టీడీపీలో అంచెలంచెలుగా పైకి వచ్చారు. కంచర్ల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌లో చేరే నాటికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆహ్వానం మేరకు 2018 ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు బీఆర్ఎస్‌లో చేరారు. తన చేరిక సమయంలోనే తెలంగాణ భవన్‌లో కృష్ణారెడ్డి కేటీఆర్ సమక్షంలో ప్రసంగిస్తూ ఇన్నాళ్లు టీడీపీలో ఆ తారకరాముడు(ఎన్టీఆర్) కోసం పని చేశామని..ఇక నుంచి బీఆర్ఎస్‌లో ఈ తారకరాముడు(కేటీఆర్) కోసం అంతే నిబద్ధతతో పనిచేస్తామని కృష్ణారెడ్డి ప్రకటించడం అప్పట్లోనే అందర్నీ ఆకట్టుకుంది. అదే రీతిలో పార్టీలో చేరిన నాటి నుంచి నేటివరకు కంచర్ల సోదరులిద్దరూ పార్టీ ఏ బాధ్యతలు అప్పజెప్పినా చిత్తశుద్ధితో పనిచేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే 2018 ఎన్నికల్లో తమ్ముడు భూపాల్‌రెడ్డికి నల్లగొండ ఎమ్మెల్యే టికెట్ కేటాయించగా ఆయన గెలుపులో ఎన్నికల వ్యూహకర్తగా కృష్ణారెడ్డి కీలకపాత్ర పోషించారు. తర్వాత హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో మేళ్లచెర్వు మండల ఇన్‌చార్జిగా బాధ్యత అప్పజెప్పితే మంచి మెజార్టీని సాధించి పెట్టారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో గుర్రంపోడు, మునుగోడు ఉప ఎన్నికల్లో మర్రిగూడ మండలాల ఇన్‌చార్జిగా వ్యవహరించి పార్టీ అభ్యర్థుల గెలుపుల్లో తన వంతు పాత్రను పోషించారు. ఇలా ఏ ఎన్నికలు వచ్చినా, పార్టీ సభలు జరిగినా, ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించడంలో కృష్ణారెడ్డికి మంచి పేరుంది. దీంతో పాటు అప్పుడు టీడీపీలోనూ, ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనూ నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలోని పార్టీ నేతలందరితోనూ కృష్ణారెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. పార్టీ శ్రేణుల్లో సైతం క్షేత్రస్థాయి వరకు కంచర్ల సోదరులుగా మంచి గుర్తింపు ఉంది. నిరుపేదల విద్యా, వైద్యం, వివాహ ఖర్చుల విషయంలోనూ విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. తన స్వగ్రామం ఉరమడ్లలో ప్రతి ఆడబిడ్డ పెండ్లికి 25వేల రూపాయల ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నారు. ఇలా అనేక కోణాల పరిశీలన అనంతరమే ఈ ఎన్నికల్లో నల్లగొండకు సరైన అభ్యర్థిగా కృష్ణారెడ్డిని ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పంచాయతీ సభ్యుడి నుంచి ఎదిగిన క్యామ మల్లేశ్

భువనగిరి స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నానికి చెందిన క్యామ మల్లేశ్‌ను ఎంపిక చేశారు. భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కోసం పార్టీ అధినేత కేసీఆర్ అన్ని రకాలుగా ఆలోచించిన మీదట క్యామ మల్లేశ్ అభ్యర్థిత్వానికి ఆయన ఓకే చెప్పారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ గ్రామానికి చెందిన క్యామ మల్లేశ్ గతంలో కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు ఆయన కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా కూడా పనిచేశారు. 2014లో ఇబ్రహీంపట్న నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఆయన స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌తో విభేదించి 2018లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే తన లాంటి బీసీ నేతలకు సరైన గుర్తింపు లేదన్న ఆవేదన మల్లేశ్ వ్యక్త పరిచేవారు. ఈ క్రమంలోనే బడుగుబలహీనవర్గాల సంక్షేమం పట్ల, నేతల పట్ల కేసీఆర్ చిత్తశుద్ధికి క్యామ మల్లేశ్ ఆకర్షితులయ్యారు. గొల్లకుర్మల కోసం ప్రత్యేకంగా కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వారి జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం ఆయన్ను ఆకట్టుకుంది. అదే విధంగా పార్టీలోనూ బీసీ వర్గాలకు పెద్దపీట వేయడం, పార్టీతో పాటు ప్రభుత్వ పదవులు కట్టబెట్టడం గమనించారు. వీటిన్నింటి ప్రభావంతో పార్టీలో చేరిన నాటి నుంచి క్రమశిక్షణ కలిగిన నేతగా పనిచేసి పార్టీ అధినేత కేసీఆర్ మన్ననలు పొందారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు ఆయనకు బీసీ సామాజిక వర్గాల్లో మంచి పట్టుంది. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ ఆయన స్వతహాగా మంచి పోరాట పటిమ కలిగిన నాయకుడు. బీసీలతో పాటు ఆయన సామాజికవర్గం అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డారు. మల్లేశ్ స్వగ్రామమైన శేరిగూడలో మొదటిసారి ఆయన పంచాయతీ సభ్యుడిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం ఆయన స్వశక్తితో అనేక పదవులు నిర్వహించటంతోపాటు చేపట్టిన ప్రతి పనిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పంచాయతీ సభ్యుడి నుంచి పార్లమెంట్ అభ్య ర్థి వరకు ఎదిగిన క్యామ మల్లేశ్ ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పనిచేయడంతో ఆయనకు గుర్తింపు లభించిందన్న చర్చ సర్వత్రా సాగుతున్నది.

యాదగిరీశుడిని దర్శించుకున్న కంచర్ల

యాదగిరిగుట్ట : నల్లగొండ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో పదేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి నల్లగొండ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కంచర్ల కృష్ణారెడ్డి

క్యామ మల్లేశ్

నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి

అభ్యర్థి పేరు : కంచర్ల కృష్ణారెడ్డి
తల్లిదండ్రులు : కౌసల్య, మల్లారెడ్డి
పుట్టిన తేదీ : 10-05-1970
కుటుంబం : భార్య సులోచన, కుమారుడు సమరసింహారెడ్డి
స్వగ్రామం : ఉరుమడ్ల, చిట్యాల మండలం, నల్లగొండ జిల్లా
చదువు : ఎంఏ, ఎల్ఎల్‌బీ.
వృత్తి : హైకోర్టు అడ్వకేట్
రాజకీయ ప్రస్థానం : టీడీపీలో ప్రారంభం

- 2017 నవంబర్ వరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు
- 2017 నవంబర్ 6న కేసీఆర్ సమక్షంలో సోదరుడు భూపాల్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్‌లో చేరిక
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండలో తన సోదరుడు కంచర్ల భూపాల్‌రెడ్డి గెలుపులో కీలక భూమిక
- **పార్టీలో బాధ్యతలు :** 2018 ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు
- 2019లో హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో మేళ్లచెర్వు మండలం ఇన్‌చార్జిగా బాధ్యతలు
- 2021లో నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో గుర్రంపోడు మండల ఇన్‌చార్జిగా బాధ్యతలు
- 2022లో మునుగోడు ఉప ఎన్నికల్లో మర్రిగూడ మండలం ఇన్‌చార్జిగా బాధ్యతలు
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో బాధ్యతలు
- **సేవా కార్యక్రమాలు :** నిరుపేదల చదువులకు, పెండ్లిళ్లకు, వైద్య ఖర్చులకు విరివిగా ఆర్థిక సాయం
- స్వగ్రామంలో ప్రతి ఆడబిడ్డ పెండ్లికి 25వేల ఆర్థిక సాయం.. రైతులకు తోడ్పాటుగా పలు కార్యక్రమాలు

భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి

అభ్యర్థి పేరు : క్యామ మల్లేశ్ కుర్మ, తండ్రి పోచయ్య
పుట్టిన తేదీ : 5-1-1965
భార్య : క్యామ జంగమ్మ, కుమారుడు : అంజన్‌కుమార్
కుమార్తెలు : ప్రియాంక, అవంతి, అరోణి
స్వగ్రామం : శేరిగూడెం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా
ప్రస్తుత నివాసం : హిల్‌కాలనీ, వనస్థలిపురం
చదువు : గ్రాడ్యుయేషన్
రాజకీయ ప్రస్థానం : 1984లో ఎన్ఎస్‌యూఐలో విద్యార్థి నేతగా ప్రారంభం

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష, జిల్లా సెక్రటరీగా బాధ్యతల నిర్వహణ
- 1992 నుంచి 1994 వరకు ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు
- 2013 నుంచి 2018 వరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు
- 2014అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ, ఓటమి
- 2018లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరిక
- 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి
- రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి..
- యాదవ, కుర్మ సామాజిక వర్గంలో నేతగా మంచి గుర్తింపు

కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడతా : కంచర్ల కృష్ణారెడ్డి

తనపై నమ్మకంతో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కంచర్ల కృష్ణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనను అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కృష్ణారెడ్డి స్పందిస్తూ బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతోపాటు ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపికలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, ఇలా ప్రతి ఒక్కరి తోడ్పాటు మరవలేనిదని తెలిపారు. వీరందరి సంపూర్ణ సహకారంతో నల్లగొండ లోక్‌సభ స్థానంలో విజయం సాధించి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రకటించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఇతర ముఖ్య నేతల అండదండలు, పార్టీ నేతల, శ్రేణుల సంపూర్ణ సహకారం, సమన్వయంతో ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. గతంలో తనకు అనేక ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉందని, జిల్లా పరిస్థితులపైనా సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, కాంగ్రెస్ పార్టీ మోసాలు, గతంలో కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి అంశాలే ఎజెండాగా ఎన్నికల్లో ముందుకు సాగుతానని తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే సామాజిక న్యాయం : క్యామ మల్లేశ్

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం జరుగుతున్నదని క్యామ మల్లేశ్ అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన అనంతరం ఆయన స్పందిస్తూ అన్ని వర్గాల వారికి రాజకీయ ప్రాతినిధ్యం లభించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారన్నారు. తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నదని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని వారందరి సహాయ, సహకారాలతో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని చెప్పారు. కొంతమంది అవకాశవాదంతో పార్టీని వీడుతున్నారని, అలాంటి వారు పార్టీని వీడినా ఎలాంటి నష్టం లేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంతో నమ్మకంతో తనకు సీటును కేటాయించారని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. ముఖ్యంగా బడుగుబలహీన వర్గాలు, దళిత మైనార్టీలకు సామాజిక న్యాయం దక్కాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీనరసింహ స్వామినిత్య తిరు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, మార్చి 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొన్నది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో క్యూలైన్లు, తిరుమాఢ వీధులు, ప్రసాద విక్రయశాల కిటకిటలాడాయి. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 38,03,491 ఆదా యం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 9105 మంది హాజరు

భువనగిరి అర్బన్, మార్చి 23: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం గణితం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9130 మంది విద్యార్థులకు గానూ 9,105 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓతో పాటు అధికారులు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెంక్షన్ అమలు చేస్తున్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట పరీక్ష కేంద్రం చిఫ్ సూపరింటెండెంట్ రఘురాంరెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మహదేవ రెడ్డి ఉన్నారు.

అవార్డులు పొందిన ఉత్తమ ఉద్యోగులతో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

చాలెంజ్‌గా తీసుకుంటే సాధించలేనిదేమీ లేదు

- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

నల్లగొండ సిటీ, మార్చి 23 : చాలెంజ్‌గా తీసుకుంటే సాధించలేనిదేమీ లేదని, ఉద్యోగులు, సిబ్బంది తమ విధులు బాధ్యతగా నిర్వర్తిస్తే ఆర్టీసీ అన్ని విధాలా ముందుకెళ్తుందని ఆ సంస్థ ఈడీ పురుషోత్తం అన్నారు. నల్లగొండ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు శుక్రవారం అవార్డులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎంపీఎల్ వచ్చేలా డ్రైవర్లు కృషి చేయాలని, ప్రతి ఉద్యోగి ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు శాయశక్తులా పని చేయాలని అన్నారు. కార్యక్రమం లో ఆర్ఎం శ్రీదేవి, ఆర్ఎంఓ మాధవి, శివశంకర్, డీఎంలు రాంమోహన్‌రెడ్డి, పాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచం పట్టిన ఇందుగుల

- ఊరంతా విష జ్వరాలు
- మూడు నెలలుగా ఒళ్లు నొప్పులు, ఒంటిపై మచ్చలతో బాధపడుతున్న గ్రామస్తులు
- ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు
- స్థానికంగా వైద్యం అందక ప్రైవేట్ దవాఖానలకు పరుగులు
- తాగునీటి శాంపిల్స్, రక్త నమూనాలు సేకరించినా తేల్చని వ్యాధి

ఇందుగుల గ్రామంలో తీవ్ర జ్వరంతో బాధపడుతున్న పందిరి లక్ష్మి

మాడ్గులపల్లి, మార్చి 23 : మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒళ్లు నొప్పులు, చర్మంపై మచ్చలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానికంగా సరైన వైద్యం అందకపోవడంతో బాధితులు నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారు. మందులు వాడుతున్నంత సేపు బాగానే ఉన్నా మందులు ఆపిన తరువాత మళ్లీ తిరగబడుతున్న పరిస్థితి.

90 శాతానికి పైగా బాధితులు

ఇందుగుల గ్రామ జనాభా సుమారు 2వేలు. అందులో దాదాపు 1800 మంది జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. ఇంట్లో ఇద్దరు, ముగ్గురిని ఈ అంతుచిక్కని వ్యాధి పట్టిపీడిస్తున్నది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఈ రోగం వ్యాప్తి చెందుతున్నది. మొదట ఒళ్లు నొప్పులతో ప్రారంభమై ఆ తర్వాత జ్వరం వచ్చి తగ్గకపోవడంతో బాధితులు బాగా నీరసించి మంచానికే పరిమితమవుతున్నారు. జ్వరం, కీళ్ల నొప్పులతోపాటు శరీరం నల్లగా కావడం, నల్లటి మచ్చలు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. భరించలేని కాళ్లు, కీళ్ల నొప్పులతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

నామమాత్రంగా వైద్య సేవలు..

గ్రామంలో మూడు నెలలుగా ప్రజలు అంతుచిక్కని రోగంతో సతమతమవుతున్నా వైద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయకుండా ఉన్న సిబ్బందితోనే నామమాత్రపు సేవలు అందిస్తూ చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జ్వరం వచ్చిందని వెళ్తే మాత్రలు ఇచ్చి సరిపెడుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రెండు నెలలుగా 125 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా.. ఇప్పటి వరకు రిపోర్టు ఇవ్వలేదని, వ్యాధి నిర్ధారణ చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు రోజుల క్రితం డీఎంహెచ్ఓతోపాటు రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీరెడ్డి గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించినప్పటికీ వ్యాధి ఏమిటో, ఎందుకు వస్తుందో నిర్ధారణ చేయలేదు. వ్యాధి నిర్ధారణకు తాగునీటి శాంపిల్స్, రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించామని చెప్తున్నారు. మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించినప్పటికీ సరైన వైద్య సేవలు అందడం లేదని గ్రామస్తులు అంటున్నారు.



స్థానిక వైద్యులతో మాట్లాడుతున్న మలేరియా నివారణ హైదరాబాద్ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

మా ఊరిలో మూడు నెలలుగా మాయదారి రోగం వెంటాడుతున్నది. జ్వరం, ఒళ్లు నొప్పులతో ఊరంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోగంతో నా ఆరోగ్యం బాగోలేదు. పట్నానికి వెళ్లి వైద్యం చేయించుకోవడంతో రూ.25వేల ఖర్చయింది. మాత్రలు వేసుకున్నంతసేపు బాగానే ఉంటుంది. తరువాత మళ్లీ తిరగబడుతుంది. అసలు ఆ